క్లుప్తంగా

అభిమానుల కోలాహలం

కడప కల్చరల్ : ప్రముఖ సినీ హీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమా ట్రైలర్ మంగళవారం కడప నగరంలోని అప్సర థియేటర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ అభిమానులైన యువత పెద్ద సంఖ్యలో థియేటర్‌కు చేరుకున్నారు. ట్రైలర్ సాగినంత సేపు వారు ప్రభాస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. అనంతరం అభిమాన సంఘం ప్రతినిధులు ఆనందంతో ఊగిపోయారు.

ఆ యాక్ట్ రద్దు చేస్తే సంతోషం

కడప అర్బన్ : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022ని రద్దు చేయాలనుకోవడం సంతోషకరమని న్యాయవాదుల సంఘం (బార్) కడప అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత రెండవ ఫైల్‌గా ఏ.పి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022ను ఉపసంహరించుకున్నట్లు సంతకం చేస్తున్నట్లు తెలపడం చాలా సంతోషమన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక నాయకులు

వేంపల్లె : భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అమలవుతున్న కార్మిక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని, కూటమి నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం తమ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో చెప్పడం జరిగిందన్నారు. సంక్షేమ బోర్డుతో పాటు పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్, గుర్తింపు కార్డులు, కార్మిక కుటుంబాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి, తదితర సభ్యులు పాల్గొన్నారు.

యోగా చేయండి.. రక్త పోటును నివారించండి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బ్రహ్మంగారిమఠం : వ్యాయామం, యోగా చేయండి.. రక్త పోటును నివారించండి అంటూ బ్రహ్మంగారిమఠం పురవీధుల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్య సిబ్బంది చేపట్టారు. 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ బీపీ పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యం పట్ల అన్ని వయస్సుల వారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంపత్‌కుమార్, సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెల్త్ అసిస్టెంట్లు మాధవ, వెంకటసుబ్బయ్య, ఎల్‌వీ రమణ కుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా


రాధాకృష్ణ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నూరు : స్థానిక రామాలయంలో వెలిసిన శ్రీరాధాకృష్ణ మందిరం బృందావనంలో మంగళవారం హనుమాన్ చాలీసా కీర్తనలు, పూజలు కమిటీ నిర్వాహకులు, భక్త రామదాసు స్వామి శిష్య బృందం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు వేద పండితులచే ఉత్సవ ఆంజనేయస్వామికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. రాధాకృష్ణులకు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు భక్త రామదాసు స్వామి బృందంచే హనుమాన్ చాలీసా కీర్తనలు భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం నాణ్యంపల్లి గోవర్ధన్ అన్నదానం నిర్వహించారు.

దుర్గమ్మా.. దీవించమ్మా..

కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. 'దుర్గమ్మా.. దీవించమ్మా' అని వేడుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– కడప కల్చరల్


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఓం సుబ్రహ్మణ్యస్వామినే నమః

కడప నగరంలోని విశ్వనాథపురం శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో మంగళవారం శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాలంలో గణపతికి బిల్వ పత్రాలతో భక్తులు స్వయంగా పూజలు చేశారు. బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలమూర్తికి పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. వేదమంత్రాల మధ్యన జరిగిన ఈ కార్యక్రమంలో స్వామికి నూతన వస్త్రాలు, పలు రకాల పూలు, పరిమళ పత్రాలు సమర్పించి నివేదన నిర్వహించారు. కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– కడప కల్చరల్


విశేష అలంకారంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి


మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత

కడప కోటిరెడ్డిసర్కిల్ : సీజనల్ వ్యాధులైన డయేరియా, అతిసార వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. మంగళవారం కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆషాడే మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాత శిశు సంరక్షణలో భాగంగా ప్రతి గర్భిణి రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వేసుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలన్నారు. గర్భిణి తప్పనిసరిగా టిఫా స్కాన్, సాధారణ స్కాన్ తీసుకొని బిడ్డ ఎదుగుదల గురించి తెలుసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణతో ఏదైనా తీవ్ర పరిణామాలు ఉంటే పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే గర్భిణి కిల్కారి మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని వారానికి నాలుగు సార్లు చొప్పున బిడ్డ వయసు సంవత్సరం వచ్చేంత వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ వస్తాయని, ఇవి మాతా శిశు సంరక్షణకు దోహదమవుతాయని తెలిపారు. ఆశా కార్యకర్తలు దైనిందిక రోజువారి కార్యక్రమంలో ఈసీస్ అప్డేషన్, ఐరన్ సిరప్ పంపిణీ, కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. వీటితో పాటు సదరు ఏఎన్ఎంకు అందుబాటులో ఉండి అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో అనుసంధానంగా ఉండి 100 శాతం అప్డేట్ చేసే విధంగా దోహదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ వైద్యులు డాక్టర్ కౌశిక్, నితీష్, శశి, కౌశిక్, రామాంజులమ్మ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కె.శివశంకర్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమైన సందర్భంగా ఒకవైపు జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు అమ్ముతూ దోచుకుంటున్నారన్నారు. మరోవైపు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభమై పది రోజులు అవుతున్నప్పటికీ, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించకుండా తరగతులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. జిల్లాలో మనబడి నాడు- నేడు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలకు సన్నద్ధమవుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు బి.అరుణ్, ఉపాధ్యక్షులు తేజ, అకిరానందన్, చంద్ర, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమకాటు ద్వారా మలేరియా వ్యాప్తి


పులివెందుల : ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పులివెందుల రూరల్ : దోమకాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య, నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి బాలాజీలు తెలిపారు. పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో మలేరియా మాసోత్సవం సందర్భంగా వారు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేని ఫ్రైడేగా నిర్ధారించి ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాల్లోని చెత్తచెదారాలను తొలగించే పనులు చేయాలన్నారు. అలాగే నీటి కుండీలు, రుబ్బురోళ్లలో ఉన్న నీటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీటి నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లుపెట్టి 8 నుంచి 10 రోజుల్లోపు దోమగా మారుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జగదీశ్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు సేవలు విస్తృతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు తమ సేవలను విస్తృతం చేయాలని డీపీఎంఓ డాక్టర్ నాగ శశిభూషణ్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణీలను గుర్తించడం, చైల్డ్‌హెల్త్ ప్రోగ్రామ్ కార్యక్రమాల్లో ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తమకు నిర్దేశించిన గృహాలను సందర్శించి వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను ఈ-ఆశా యాప్‌లో నమోదు చేయాలని కోరారు. మాతాశిశు మరణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారికి ఐరన్ ట్యాబ్లెట్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి, డీపీహెచ్ఓ అరుణకుమారి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నారాయణ, వైద్యాధికారులు డాక్టర్ జోత్స్న స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ సౌమ్య, సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

సింహాద్రిపురం : మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఆ వాహనాలకు జరిమానా విధిస్తామని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని బస్టాండు సెంటర్, దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తమ వాహనాలను ఖాళీ ప్రదేశాల్లో ఉంచాలన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


శేషవాహనంపై దర్శనమిస్తున్న స్వామి వారు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం కుంభప్రతిష్ఠ, అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం, ఉత్సవబలి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి గుడిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

14న గుట్టరాళ్ల టోల్‌గేటు వేలం పాట

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొలుములపల్లె గ్రామ పంచాయతీలోని గుట్టరాళ్ల టోల్‌గేటు వేలం పాటను ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కొలుములపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి జీఎల్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీ పేరున ఎస్‌బీఐలో రూ.50 వేల డీడీగానీ, నగదుగానీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వేలం దక్కించుకున్నవారు మొత్తం డబ్బును పాట అనంతరం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం పాటకు సంబంధించిన సర్వహక్కులు కొలుములపల్లె గ్రామ పంచాయతీకి చెందుతాయని ఆయన వివరించారు.

ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొందాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

వల్లూరు : ఎన్నికల్లో మన పార్టీ అధికారంలోకి రాలేదని ఏ ఒక్కరూ అధైర్య పడొద్దని, ఎలాంటి పరిస్థితులనైనా అందరం కలిసి కట్టుగా ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ఎమ్మెల్యే పి రవీంద్రనాథరెడ్డి అన్నారు. కడప పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలోని నియోజకవర్గంలోని వల్లూరు మండలానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో మంగళవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేనంత మాత్రాన ఏ ఒక్కరూ అధైర్య పడొద్దని అన్నారు. ఎల్లప్పుడూ తాను అందుబాటులో వుంటానని, పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు తన దృష్టికి తీసుకుని వస్తే వీలైనంత వరకు వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం మంచి పద్ధతి కాదు

జమ్మలమడుగు : ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజం. గెలిచిన వారు ఓడిపోయిన వారిపై దాడులు చేయడం సరైంది కాదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ గెలిచిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకుల, కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి దాడులు చేయడంతోపాటు, చిత్రహింసలకు గురిచేయడం సరైందికాదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందించారు. ప్రజా తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. కేంద్రంలో ప్రభుత్వం గతంలో ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి ఇవ్వకుండా చేతులు ఎత్తేసింది. ఇప్పుడు కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి టీడీపీ మద్దతుతోనే వచ్చింది. ఇప్పుడు మన రాష్ట్రానికి కావలసిన ప్రత్యేక హోదాతోపాటు స్టీల్‌ప్లాంట్, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజిలను సాధించటానికి ఇది మంచి అవకాశం అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుల, కార్యకర్తల ఇళ్లపైన దాడులు సరి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల, కార్యకర్తలపై దాడులను ఇలాగే కొనసాగితే తాము కూడా న్యాయబద్ధంగా పోరాటం చేస్తామన్నారు. కూటమి అభ్యర్థులు ఎమైన కవ్వింపు చర్యలకు పాల్పడినప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులు సంయమనం పాటించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

కడప ఎడ్యుకేషన్ : అత్యవసర సమయాల్లో అవసరమున్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఖున్ కా రిస్తా చైర్మన్ తారిఖ్ అలీ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం ఒక పేషంట్‌కు రక్తం అవసరమని డాక్టర్లు సూచించారు. దీంతో విషయం తెలుసుకుని స్పందించిన ఖూన్ కా రిస్తా చైర్మన్ తారిఖ్ అలీ స్వచ్ఛందంగా కడపలోని బృహదా రక్తనిధి వద్దకు వచ్చి బి పాజిటివ్ రక్తదానం చేసి తమ సేవాతత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బృహద బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్స్ శ్యామ్, సౌజన్య, బీబీజాన్ పాల్గొన్నారు.

14న రక్తదాన శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న ఉదయం 9 గంటలకు కడప నగరం బాలాజీనగర్‌లో గల యూత్ హాస్టల్ బిల్డింగ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జేబీవీఎస్ ది ప్రెజెర్వర్ సేవా సమితి, సమరిటన్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారితోపాటు తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా బాధితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు సంస్థ ప్రతినిధులు అశోక్ (90141 10325), విజయ్ (84640 71937)లను సంప్రదించాలని కోరారు.

రెండో తహసీల్దార్ ఆఫీసు ఏర్పాటు చేయాలి


డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండవ తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు మంగళవారం డీఆర్వో గంగాదర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. నగరంలో పెరిగిన జనాభా అవసరాలను పరిగణనలోకి తీసుకుని 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రెండవ తహసీల్దార్, సిబ్బందిని నియమించారని పేర్కొన్నారు. వైఎస్సార్ అకాల మరణంతో రెండవ కార్యాలయాన్ని ఇంత వరకు ఏర్పాటు చేయలేదని తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన సిబ్బంది మాత్రం ఆర్డీఓ కార్యాలయంలో పని చేస్తున్నారని చెప్పారు. దీంతో ప్రజలు తమ పనులు జరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్, లోక్‌సత్తా నాయకులు దేవర శ్రీకృష్ణ, ఆప్ నాయకులు శ్రీనివాసులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు అక్రమ్, నాసిర్ హుస్సేన్, మల్లెం విజయభాస్కర్, సిరాజ్, జాకీర్, రఫీ, సాంబ తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తొండూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అరీఫుల్లా తెలిపారు. తొండూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు గర్భస్థ పరీక్షలు, రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేసి రక్తహీనత కలిగిన వారికి ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ వందనయోజన ఆర్థిక ప్రయోజనాలను అందించాలన్నారు. పెద్దలకు ఇచ్చే డీసీజీ వ్యాక్సిన్ 18 సంవత్సరాలు పైబడిన వారికి మధుమేహం, పొగతాగే అలవాటు ఉన్నవారికి, బరువు తక్కువ ఉన్నవారికి, 60 సంవత్సరాలు పైబడిన వారికి 100 శాతం వ్యాక్సిన్ ఇవ్వాలన్నారు. వర్షాకాలం మొదలౌతుండటంతో నీటి నిల్వలు లేకుండా, లార్వా వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుడటం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ముందుగా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీ, పట్టణ పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులకు పీహెచ్‌సీలలోనే డెలవరీ చేయించాలని ప్రొద్దుటూరుకు ఎందుకు రేఫర్ చేస్తున్నారన్నారు. ప్రతి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డెలవరీ కేసులన్నింటిని పీహెచ్‌సీలలోనే చేయించాలని సూచించారు. అలాగే గ్రామాలలో వార్డులలో పర్యటించి జర్వాలపై సర్వే చేయాలని ఆదేశించారు.

వేసవి శిబిరాలతో జ్ఞాన సముపార్జన


భగవద్గీత శ్లోక పఠనంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కమలాపురం : వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవచ్చని ఆర్యవైశ్య కమిటీ చైర్మన్ కె.వెంకటరమణయ్య, మాజీ చైర్మన్ భూపాళం సుబ్బారావు తెలిపారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గత 20 రోజులుగా ప్రొద్దుటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో భాగంగా 'భగవద్గీత శ్లోక పఠనం' శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు, భగవద్గీత, బహుమతులుగా అందజేశారు. కమలాపురంలో గతంలో ఎన్నడూలేని విధంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటవిడుపుగా భగవద్గీత శ్లోక పఠనంపై శిక్షణ నివ్వడం చాలా సంతోషకరమన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల వల్లనే విద్యార్థులు జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవచ్చన్నారు. వేసవి శెలవుల్లో ఇలాంటి శిక్షణలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులైన భూపాళం బ్రదర్స్ శివరామకృష్ణ, హరి భాస్కర్‌లను ఆర్యవైశ్యులు సత్కరించారు. అనంతరం వారు ఆర్యవైశ్య కమిటీ చైర్మన్, మాజీ చైర్మన్‌లను సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

జమ్మలమడుగు : నీట్ పరీక్ష-2024 ఫలితాలపై, పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేసి మాట్లాడారు. 2024 నీట్ పరీక్ష నిర్వాహణ బాధ్యత చేపట్టిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవహరించిన తీరు అనుమానాలు కలిగిస్తున్నాయన్నారు. నీట్‌పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రంలోని ఒకే సీరియల్ నెంబర్లతో కూడి ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన తీరుపై విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం జె.వి.భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి మేనిఫెస్టోలో చేర్చిన ప్రకారం కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లలో పనిచేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేసి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగుమస్తాన్, ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నాగేష్, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.